## 2

# యోసేపుకు తెలియజప్పుట మరియు కన్య గర్భమందు జన్మించుట

## (1:18-25)

యేసు తలితండ్రుల గూర్చి సుపరిచితమైన కథ మత్తయి 1:18-25లో తెలియజెప్పబడి యున్నది. యోసేపునకు మరియ కుటుంబమునకు, ముఖ్యంగా మరియకు, యేసు జన్మము గూర్చిన ఆ ప్రకటన ఆకస్మికముగా ఎంత అచ్చెరువును కలిగించిన అంశమై యుండినదో మనము ఊహించుకొనవచ్చును.

యేసు, ప్రవచనము యొక్క నెరవేర్పైయుండెనని ఈ వృత్తాంతము నొక్కివక్కాణించుచున్నది; యుగయుగాలుగా ఉండిన దేవుని ప్రణాళిక చివరకు వెల్లడయ్యింది. యేసు సామాన్య మానవుడు కానివాడై యుండెనను వాస్తవమును అది ప్రముఖంగా ప్రకటించుచున్నది; ఆయన పరిశుద్ధాత్మ చేత గర్భముదాల్చబడెను. ఆయన నిజముగా శరీరదారియైన దేవుడై యుండెను. నీతిమంతమైన ఆయన యొక్క ఇహలోక తల్లిదండ్రుల ప్రవర్తనను గ్రంథ పాఠము ప్రాస్తావించుచున్నది; యేసు ఈ లోకము లోనికి జన్మించిన విధానము గూర్చినది కళంకమైన విషయమేదియును లేదు.

### ప్రమాదకరమైన పరిస్థితి – "గర్భవతిగా ఉండెను" (1:18)

**18యేసు క్రీస్తు జననవిధ మెట్లనగా, ఆయన తల్లియైన మరియ యోసేపునకు ప్రధానము చేయబడిన తరువాత వారేకము కాకమునుపు ఆమె పరిశుద్ధాత్మవలన గర్భవతిగా ఉండెను.**

**వచనము 18.** గ్రీకు పదము (*genesis*), 1:18లో **జననము** అని అనువదింపబడినది, ఇది 1:1లో నుండి పునరుక్తమగుచున్నది. ఆచ్చట అది "వంశావళి" అని అనువదింపబడినది. అదివరకటి రెఫరెన్సు మెస్సీయ యొక్క మానవ వంశపారంపర్య మూలమును ప్రారంభించినది, తరువాత రెఫరెన్సు **యేసు క్రీస్తు** ఈ లోకమునకు ఏతెంచిన సమాచారమును స్పష్టంగా సమకూర్చుచున్నది.

**ఆయన తల్లియైన మరియ**[1] **యోసేపునకు ప్రధానము చేయబడినది.** ప్రాచీన యూదీయ ప్రపంచంలో, ప్రధానము ఆధునిక పాశ్చాత్య ప్రధానము కంటే ఎక్కువగా బంధించుచున్న విషయమై యుండినది (ద్వితీయోపదేశకాండము 20:7).[2] ప్రధానము చేసికొనిన దంపతులు ఆవశ్యకముగా పరిణయమాడినవారిగా పరిగణింపబడ్డారు, కానీ వారు ఒకేచోట కలిసి జీవించలేదు. యోసేపు మరియు మరియల విషయంలో, వారు "భర్త" (1:19) మరియు "భార్య" (1:20) అని పిలువబడ్డారు.[3] ప్రధానము చేసికొనిన పురుషుడు అట్టి సంబంధమును వివాహమునకు మునుపు తెగదెంపులు చేసికొనదలచినట్లయితే, అతడు ప్రధానము చేసికొనిన స్త్రీ చేతిలో, వారు వివాహము చేసికొనినప్పుడు ఏ విధంగా చేయునో

(ద్వితీయోపదేశకాండము 24:1-4; మార్కు 10:4)[4] ఆ విధంగానే "విడాకుల అధికార పత్రము"ను ఉంచవలసి యుండెను. ఈ అధికార పత్రముపై కనీసము ఇద్దరు సాక్షులు వారి చేరాలు చేయవలెను, లేదా పరిణయమాడిన భర్త తన భార్యకు అందించు అధికార పత్రము ఇద్దరు సాక్షుల సమక్షంలో అందజేయబడవలెను.[5] ఈ వ్యవహార కార్యక్రమము కొరకు ఏ న్యాయాధిపతియైనను లేక ఏ న్యాయస్థానమైనను అవసరము లేకుండినది. మిశ్నా (టాల్ముడ్‌లోని మొదటి భాగము - యూదుల నియమములు) ప్రకారము, అట్టి అధికార పత్రములో "ఇదిగో, నీవు ఏ పురుషునైనను వివాహము చేసికొనుటకు నీకు అనుమతి ఇవ్వబడుచున్నది" అని రాయబడి యుండినది.[6] ప్రధానము చేసికొనిన ఇరువురిలో ఏ ఒక్కరైనను వివాహవిధి శోభనముతో వివాహ కార్యము పూర్తికాక మునుపు మరణించినట్లయితే, బ్రతికియున్న వ్యక్తి విధవరాలిగా లేక విధురుడుగా ఎంచబడెను. నిశ్చితార్థ వ్యవధి కొన్ని మాసములు మొదలుకొని ఒక సంవత్సరము వరకు కొనసాగినది, అటుతరువాత పెండ్లి కుమారుడు - వివాహమహోత్సవ మేళముతో - తన పెండ్లి కుమార్తెను పరిగ్రహించి కమనీయమైన కళ్యాణోత్సవములో వారు కాళ్లు మోపి కుటుంబముగా స్థిరపడు చోటికి తీసికొని వెళ్లుటకు వచ్చును (22:1-14; 25:1-13 చూడుము).

**వారేకము కాకమునుపు ఆమె పరిశుద్ధాత్మవలన గర్భవతిగా ఉండెను**. దేవదూత వచ్చి ఆమె గర్భముదాల్చి కుమారుని కనునని మరియకు ప్రకటించిన మరియు ఆమె ఎలీసబెతుతో కూడ మూడు మాసములు గడుపుట గూర్చి లూకా రాసిన సువార్త సవివరమైన సమాచారమును సమకూర్చుచున్నది (లూకా 1:26-56). ఈ కాలము గడిచిన తరువాత, ఆమె తన స్వస్థలమునకు తిరిగి వచ్చినది, మరియు గర్భవతిగా నున్న సంకేతములను చూపించుచుండినట్లు స్పష్టమగుచున్నది. యోసేపు మరియతో లైంగిక సంబంధము కలిగియుండలేదు గనుక, ఆమె అతని యెడల విశ్వాసఘాతుకరాలై యుండినదని అతనికి అనిపించింది. ధర్మశాస్త్రము ప్రకారము, ఇరువురిలో ఏ ఒక్కరైనను విశ్వాసఘాతుకమునకు పాల్పడినట్లయితే అది వ్యభిచారముగా పరిగణింపబడినది, గనుక దోషి రాళ్లతో కొట్టబడి చంపబడవలెను (ద్వితీయోపదేశకాండము 22:23, 24).

## ఆశీర్వాదము - కుమారుడు రక్షకుడగును (1:19-21)

**19ఆమె భర్తయైన యోసేపు నీతిమంతుడై యుండి ఆమెను అవమానపరచనొల్లక రహస్యముగా ఆమెను విడనాడ ఉద్దేశించెను. 20అతడు ఈ సంగతులను గూర్చి ఆలోచించుకొనుచుండగా, ఇదిగో ప్రభువు దూత స్వప్నమందు అతనికి ప్రత్యక్షమై దావీదు కుమారుడవైన యోసేపూ, నీ భార్యయైన మరియను చేర్చుకొనుటకు భయపడకుము, ఆమె గర్భము ధరించినది పరిశుద్ధాత్మవలన కలిగినది; 21ఆమె యొక కుమారుని కనును; తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువనెను.**

**వచనము 19. యోసేపు,** మరియ **భర్త**, మరియ గర్భవతియైనదనియు, పుట్టబోవు శిశువునకు తండ్రి ఆయన కాడనియు అతడు తెలిసికొనినప్పుడు, ఇప్పుడేంచేయాలో తీర్మానించుకొనుటకు ఆయనకు ఒక సంకటావస్థ ఎదురయ్యింది. **యోసేపు నీతిమంతుడై యుండి** దేవుని చిత్త ప్రకారమే చేయుటకు ఆశించుచుండినవాడై, **మరియను బహిరంగముగా**

**అవమానపరచనొల్లక** లేక ఆమెను రాళ్లతో కొట్టించుటకు ఇష్టపడక, ప్రణాళిక ప్రకారం ఆమెకు విడాకులిచ్చి, **రహస్యముగా ఆమెను విడనాడ ఉద్దేశించెను**. "విడనాడ" (*apoluō*) అను పదమునకు ఈ సందర్భములో "విడాకులు" యని అర్థము. డోనాల్డ్ ఏ. హేగ్నర్ గమనించిన విషయం ఇలా ఉన్నది, "యోసేపు మరియను ఒక వ్యభిచారిణిగా బట్టబయలు చేయనుద్దేశించలేదు సరి కదా, అట్లయినను పాపము విషయములో ఇంత స్పష్టముగా దోషియైన ఆమెను వివాహమాడుటకును సిద్ధపడలేదు."[7]

రాళ్లతో కొట్టి చంపుటయైనను యోసేపుకు ఒక ఎంపికయై యుండినదా అను విషయమై కొన్ని ప్రశ్నలున్నవి. రాబర్ట్ హెచ్. గుంద్రి ఇలా సూచించుచున్నాడు, "రాళ్లతో కొట్టి చంపవలెనని ఉద్దేశింపబడిన విషయమై యూదా మత బోధకులకు సంబంధించిన ఒక ఋజువు కొంత సడలింపును సలహా ఇచ్చుచున్నది ... మరియు నేరస్థుడుగా ఎంచబడుచుండిన పురుషుడు మత్తయి సువార్తలో లేడు."[8] వ్యభిచారములో పట్టబడిన స్త్రీ (యోహాను 7:53–8:11) గూర్చి వ్యాఖ్యానించుచు, "... మరణ దండనను బలవంతముగా విధించుటకు" మొదటి శతాబ్దములో రోమా ప్రభుత్వమునకు ప్రత్యేక హక్కులుండినవి అని డి. ఎ. కార్సన్ వివరించుచున్నాడు.[9] ఏదిఏమైనా, క్రీస్తు పుట్టిన కొంత కాలము తరువాత రోమీయులు ఈ అధికారమును యూదులు నుండి కైవశం చేసికొన్నారు[10] (10:18; 12:14పై రాయబడిన వ్యాఖ్యానమును చూడుము).

అతడు వివాహము చేసికొననై యుండిన పెండ్లి కుమార్తెపై కనికరము కనుపర్చవలెననియే, బహిరంగముగా అవమానపర్చుట నుండి ఆమెను కాపాడవలెననియే, యోసేపు దృఢనిశ్చయం చేసికొన్నాడు. డగ్లస్ ఆర్. ఏ. హేర్ గమనించిన విషయం ఇలా వున్నది, "యోసేపు, అతనిలో తలెత్తిన కోపమునుబట్టి వారిరువురి సంబంధమును సమాప్తిచేయవలెనని తీర్మానించుకొనలేదు కానీ లోతైన మతసంబంధమైన ఒప్పింపునుబట్టియే[11] యోసేపు మత్తయికి అత్యంత ప్రియమైన, 'కనికరమునే కోరుచున్నాను, గాని బలి కోరను' అను నియమము ప్రకారము జీవించుచుండెను" అని కూడ ఆయన రచించాడు (హోషేయ 6:6, మత్తయి 9:13లోను, 12:7లోను ఉల్లేఖించి చెప్పబడినది).[12]

**వచనము 20**. యోసేపు ఒక నిర్ణయానికి వచ్చిన తరువాత, ఒక కల కన్నాడు, **ప్రభువు దూత స్వప్నమందు అతనికి ప్రత్యక్షమై, దావీదు కుమారుడవైన యోసేపూ, నీ భార్యయైన మరియను చేర్చుకొనుటకు భయపడకుము** అని చెప్పాడు. తత్ఫలితంగా, మరియను రహస్యముగా విడనాడు ఉద్దేశమును మానుకొనవలెనని యోసేపు తన మనస్సును మార్చుకొన్నాడు. "యోసేపు యెడల మరియ తన మనస్సులో మాటలాడుకొనుచుండిన అమాయకత్వముతో కూడిన ఆక్షేపణలు నిస్సందేహముగా నిజమైనవేనని ఇప్పుడు కనబడుచున్నది."[13]

యోసేపు స్వప్నములు క్రీస్తు పుట్టుకను గూర్చిన వృత్తాంతము గుండా అల్లుకొనుచు ముందుకు వెళ్లుచున్నవి (1:20; 2:12, 13, 19, 22). రాబర్ట్ హెచ్. మౌన్స్ ఇలా చెప్పుచున్నాడు, "కొన్ని కోణాల్లో ఈ యోసేపు తన వలెనే పాత నిబంధనలో సమాన నామధేయముగలవానికి [యాకోబు కుమారుడైన యోసేపునకు], ఒక ప్రతిబింబమై యున్నాడను విషయం గమనింపబడినది, యాకోబు కుమారుడైన యోసేపు కూడ నీతిమంతుడై యుండెను, స్వప్నముల చేత ప్రభావితమయ్యాడు, మరియ ఐగుప్తు లోనికి ప్రయాణమై వెళ్లునట్లు

బలవంతము చేయబడ్డాడు."[14] బెన్ విదరింగ్‌టన్ III ఇలా వ్యాఖ్యానించుచున్నాడు,

> [మత్తయి] తన దృష్టిని మరియ జీవితంలో చోటుచేసికొన్న దైవికమైన జోక్యము యెడల యోసేపు ప్రదర్శించిన ప్రతిస్పందనపై కేంద్రీకరించుచున్నాడు, గనుక యోసేపు దేవుని చిత్తమునే నెరవేర్చుటకు స్వప్నముల ద్వార పునరుక్తంగా నడిపింపబడిన విధానమును మత్తయి ప్రత్యేకించి చూపించుచున్నాడు. యేసును మినహాయిస్తే, యోసేపు మాత్రమే "దావీదు కుమారుడు" అని పిలువబడుట ప్రమాదవశత్తు సంభవించుచున్న సంగతి కాదు. దేవుడిచ్చు నిర్దేశనముల ననుసరించుచు, మరియ మరియు యోసేపును నిచ్చును కాపాడు ఒక నమూన వంటి మూలపురుషునిగా ఆయన పరిగణింపబడుచున్నాడు.[15]

"దావీదు కుమారుడు" అను బిరుదు యోసేపు, యేసునకు ఇహలోక తండ్రిగా ఆయనను పెంచినాడు, రాజైన దావీదు వంశస్థులలో ఉన్నాడని బలపర్చుచున్నది – ఈ వాస్తవము వంశావళిలో వ్యక్తము చేయబడియున్నది (1:1, 6, 16).

మరియకు తెలియజెప్పబడిన ప్రకటన విషయంలో, ఆ సందేశమును అందజేసిన దేవదూత గబ్రియేలు అని పేర్కొనబడి యున్నది (లూకా 1:26). అయితే యోసేపు విషయంలో, ఆయనకు సందేశము అందజేసిన దేవదూత ఎవరో పేరు పేర్కొనబడలేదు. **మరియ గర్భము ధరించినది పరిశుద్ధాత్మవలన కలిగినదని** దేవదూత యోసేపుకు తెలియ జేసాడు. అద్భుతకరముగా గర్భముదాల్చబడిన ఈ విషయమును మత్తయి వివరించిన విధానము ప్రత్యేకమైనదియు పూజనీయమునై యున్నది (1:18, 20). హేగ్నర్ ఇలా వ్యాఖ్యానిస్తున్నాడు, "అన్యమతారాధనకు సంబంధించిన అభిప్రాయం [ఇది గ్రీకు పౌరాణిక కథనములో సామాన్యమైన విషయము], అనగా ఒక దేవత ఒక స్త్రీతో లైంగిక సంభోగ సంబంధము కలిగియుండుట గూర్చిన ఎరుక మనకు లేదు కానీ దేవుడు తన సంకల్పమును నెరవేర్చుకొనునట్లు ఆయన యొక్క సృజనాత్మక శక్తి మరియలో దాని కార్యమును నెరవేర్చినది."[16] పరిశుద్ధాత్మ ఒక అండమును మరియ గర్భాశయమునందు పరిశుద్ధ బీజముతో, ఈ రెండింటి కలయిక యొక్క ఫలితము మానవీయమును దైవికమైన దియునై యుండునట్లు, గర్భదారణ చేశాడు (లూకా 1:31–35). మరియ గర్భములో రూపురేఖలు దిద్దుకొన్న శిశువు మానవ శరీరము ధరించిన "దేవుని వాక్యమై" యుండెను (యోహాను 1:1, 14). యూదా మత బోధకుల అభిప్రాయమును సంగ్రహపర్చుచు, డేవిడ్ హిల్ ఇలా రాశాడు, "సృష్టికి పునాది వేయబడినప్పుడు దేవుని ఆత్మ ఎంత చురుకుగా ఉండెనో, దాని నవీకరణ సమయంలో కూడ దేవుని ఆత్మ అంతే చురుకుగా ఉండునని ఆశింపబడినది."[17] ఆయన ఇంకా ఇలా చెప్పాడు, "దేవుని ('పరిశుద్ధాత్మ') యొక్క సృజనాత్మక శక్తి మరియు కార్యకలాపము మెస్సీయ సంబంధిత విమోచకుడు గర్భమున ధరింపబడుట ద్వార నూతన సృష్టికి ఆరంభోత్సవము సలుపుచుండినాడని మత్తయి ధ్వనించుచున్నాడు."[18]

**వచనము 21.** మరియ గర్భమునందున్న శిశువు **ఒక కుమారుడై** యుండెననియు, **తన ప్రజలను వారి పాపము నుండి ఆయనే రక్షించును,** గనుక ఆయనకు **యేసు అను పేరు** పెట్టబడుననియు దేవదూత యోసేపుకు తెలియజెప్పాడు. "యేసు" (*Iēsous*) అను పేరు, "Joshua" (*Y$^e$hoshua'*) అను హెబ్రీ పేరునకు గ్రీకు రూపమై యున్నది, "యాహ్వే రక్షణయై యున్నాడు" అని దీని అర్థము. సామాన్యమైన ఈ యూదీయ నామము (అపొస్తలుల కార్యములు 13:6; కొలొస్సయులకు 4:11) ఎంపిక చేయబడినది, ఏలయనగా

అది దేవుని కుమారుడు ఈ లోకములోనికి రానైయుండిన సంకల్పమును నిర్దిష్టముగా నియమించినది. ఆ సంకల్పమేమనగా, “ఆయన తన ప్రజలను వారి పాపముల నుండి రక్షించుట” (యెషయా 53:5, 6; యిర్మీయా 31:31–34; మత్తయి 20:28; 26:26–28; గలతీయులకు 4:4, 5; 1 తిమోతి 1:15 చూడుము).

అప్రమాణిక గ్రంథము (అపొక్రిఫ) నుండి ఒక వాక్యభాగ్యము కూడ ఈ పేరునకు గల అర్థములో దాని వంతు పాత్ర వహించుచున్నది:

> నూను కుమారుడైన *యెహోషువ* యుద్ధశూరుడై యుండెను,
> ప్రవక్త నిర్వహించాల్సిన పదవి బాధ్యతల్లో మోషేకు ఉత్తరాధికారియై యుండెను.
> *అతని పేరు ధ్వనించుచున్నట్లు,* అతనికి విరోధముగా లేచిన శత్రువులపై పగదీర్చుకొనునట్లును,
> ఇశ్రాయేలుకు దాని స్వాస్థ్యమును అనుగ్రహించునట్లును,
> దేవుడేర్పరచుకొన్న జనాంగమునకు అతడొక గొప్ప *రక్షకుడయ్యాడు.*[19]

మొదటి యెహోషువ ఒక సైనిక రక్షకుడుగా వచ్చియుండగా, రెండవ యెహోషువ (యేసు) ఒక ఆధ్యాత్మిక రక్షకుడుగా వచ్చాడు. ఈయన ఒక జాతీయ వాదమునకు సంబంధించిన సంకల్పము నిమిత్తము – యూదులను రోమా ప్రభుత్వము యొక్క హింసాత్మక వ్యధ నుండి విడిపించుటకు – లేదా ఈ పుడమిపై భౌతికంగా ఒక ఐహిక రాజ్యమును వ్యవస్థాపించుటకు రాలేదు. దానికి బదులుగా, ఆయన మానవ జాతిని అపరాధ దోషము మరియు పాపమువలన వచ్చు ఫలితము నుండి (రోమీయులకు 3:23, 24; 6:23 చూడుము) విమోచించుటకు వచ్చాడు. లియోన్ మోర్రిస్ తన ప్రకటనలో ఇలా వివరించుచున్నాడు, “ఆయన తన ప్రజలను వారి పాపములనుండి రక్షించును,” “ఆయన” (*autos*) అను పురుషవాచక సర్వనామము ఉద్ఘాటించి చెప్పుచున్న పదమై యున్నది, మరియు “ఆయన తప్ప ఇతరులెవరును కాదు” అని అర్థమిచ్చుచున్నది.[20]

యేసు మొదట “తన స్వకీయుల యొద్దకు వచ్చెను,” (యూదా జనాంగము) మరియు సమస్త మానవాళిని రక్షించుటకు వచ్చెను (యోహాను 3:16–21). యూదులు, అధిక శాతం, ఆయనను తృణీకరించారు (యోహాను 1:11), కానీ అయన రాజ్యములోనికి అన్యజనులు సహితము ఆహ్వానింపబడ్డారు. “తన్ను ఎందరంగీకరించిరో వారికందరికి, అనగా, తన నామమునందు విశ్వాసముంచినవారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను” (యోహాను 1:12). అనగా, విశ్వసించువారు “దేవుని పిల్లలు” అని దీని అర్థం కాదు, కానీ విశ్వసించువారికి దేవుని పిల్లలగుటకు హక్కు ఇయ్యబడినదని అర్థము. పుట్టిన వారందరును గిట్టక తప్పదు (హెబ్రీయులకు 9:27), కానీ యేసు ఒక్కడు మాత్రమే ప్రత్యేకముగా మరణించుటకే పుట్టాడు. ఆయన పాపముల ప్రాయశ్చిత్తార్థము సంపూర్ణమైన బల్యర్పయై యుండుటకు వచ్చాడు (హెబ్రీయులకు 9:26–28; 10:5–10; 1 యోహాను 2:2; 4:10).

### ప్రవచనము – కన్యక గర్భమందు జన్మించుట (1:22, 23)

**22ఇదిగో కన్యక గర్భవతియై కుమారుని కనును ఆయనకు ఇమ్మానుయేలను పేరు**

**పెట్టుదురు అని ప్రభువు తన ప్రవక్త ద్వారా పలికిన మాట నెరవేరునట్లు ఇదంతయు జరిగెను. [23]ఇమ్మానుయేలను పేరునకు భాషాంతరమున దేవుడు మనకు తోడని అర్థము.**

**వచనము 22**. పాత నిబంధనలోని ప్రవచనములను యేసు **నెరవేర్చాడు** అని ఉద్ఘాటించి తెలియజెప్పు అనేక ఉల్లేఖనములలోని తొలి ఉల్లేఖనము ఈ వచనములో నున్నది (1:22; 2:15, 17, 23; 4:14; 8:17; 12:17; 13:35; 21:4; 26:56; 27:9). కొండమీద ప్రసంగములో "ధర్మశాస్త్రము నైనను ప్రవక్తల ప్రవచనములనైనను కొట్టివేయవచ్చితినని తలంచవద్దు; నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు నేను రాలేదని" యేసు సెలవిచ్చాడు (5:17). **ఇదంతా** కూడ ఈ విభాగములో (1:18–25) వర్ణించబడినట్లు కన్యక అద్భుతకరముగా గర్భముదాల్చుట మరియు కుమారుని కనుటకు సంబంధించినదై యున్నది. **ప్రభువు** తన **ప్రవక్త** ద్వారా పలికిన మాట అని మత్తయి సుస్పష్టముగా తెలియజెప్పాడు, ఇతర సందర్భములలో ప్రవచనము పలికిన ప్రవక్త మాత్రమే పేర్కొన్నాడు గనుక అందులో దైవికమైన ప్రేరేపణ కలదని భావింపబడినది. ఈ సందర్భములో పేరు పేర్కొనబడని ప్రవక్త యెషయాయై యున్నాడు.

**వచనము 23.** ఇచ్చట ఉల్లేఖించి చెప్పబడిన ప్రవచనము యెషయా 7:14లో నుండి తీసికొనబడినది: **ఆలకించుడి, కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేలను పేరు పెట్టును** మత్తయి, సెప్టుజింట్‌ను అనుసరించాడు, అచ్చట గ్రీకు పదము *parthenos,* అనగా "కన్యక" అని అర్థమిచ్చు పదమునకు ప్రత్యామ్నాయముగా హెబ్రీ పదము *'almah* వాడబడినది. పాత నిబంధనలో *'almah* అను పదము తరుచుగా వివాహముకాని "కన్యక" అని అర్థమిచ్చును (ఆదికాండము 24:43; పరమగీతము 1:3; 6:8 చూడుము). ఇతరమైన మూడుసార్లు, ఈ పదము ఒక యౌవ్వనురాలైనదియు, వివాహముకానిదైన అమ్మాయిని సూచించుచున్నది (నిర్గమకాండము 2:8; కీర్తనలు 68:25; సామెతలు 30:19 చూడుము). పాతనిబంధనలో *'almah* అను పదమును ఎన్నడైనను పరిణయమాడిన పద్ధతి విషయంలో ప్రయోగింపబడలేదని ఈ నిదర్శనముల ఉద్ఘాటన తెలియజేయుచున్నది.

యెషయా 7:14, నకు గల అనువాదమునకు ఆవల, ఈ వచనమును గూర్చి ఇతర ప్రశ్నలు లేవదీయవలెను. ఈ ప్రవచనము క్రీస్తు కన్యక గర్భమందు జన్మించుటకు మాత్రమే సంబంధించినదై యున్నదా, లేక ద్వంద్వ నెరవేర్పులేవైనా ఉన్నాయా? యెషయా గ్రంథంలోని ప్రవచనము అసలు చదువరులు చేత అది ఎలా అనువదింపబడి యుండును? ఈ ప్రవచనమును మత్తయి ఎలా ప్రయోజనపర్చుకొన్నాడు?

దావీదు యొక్క రాజత్వ వంశపరంపరను (యెషయా 7:6) నాశనము చేయుటకు దేవుడు ఇద్దరు రాజులను అనగా, సిరియా రాజైన రెజీనును మరియు ఇశ్రాయేలు రాజైన పెకహును (యెషయా 7:1), అనుమతించాడని అతనికి అభయమునిచ్చుటకు ఈ ప్రవచనము దుర్మార్గుడును రాజునైన ఆహాజుకు యెషయా చేత దాదాపుగా క్రీ.పూ. 735లో తెలియజెప్పబడినది. దేవుని ప్రజలపై వారి సొంత రాజవంశ పరంపరను వ్యవస్థాపించుటకు ప్రాణహాని కలిగించు వారి పన్నాగమును వారు నెరవేర్చుకొనకుండునట్లు అన్యమతారాధికులైన ఈ రాజులను దేవుడు నిరోధించును (ఆదికాండము 49:10; 2 సమూయేలు 7:12, 13 చూడుము). ఆయన చేసిన వాగ్దానము నెరవేరుననుటకు, దేవుడు ఆహాజుకు ప్రవక్తయైన

యెషయా ద్వార సంకేతమును సూచించాడు.

> కాబట్టి ప్రభువు తానే యొక సూచన మీకు చూపును. ఆలకించుడి, కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేలను పేరు పెట్టును. కీడును విసర్జించుటకును మేలును కోరుకొనుటకును అతనికి తెలివి వచ్చునప్పుడు అతడు పెరుగు, తేనెను తినును. *కీడును విసర్జించుటకు మేలును కోరుకొనుటకును ఆ బాలునికి తెలివి రాక మునుపు నిన్ను భయపెట్టు ఆ యిద్దరు రాజుల దేశము పాడుచేయబడును* (యెషయా 7:14–16; నొక్కి చెప్పినది నాది).

ఆహాజు ఒక సంకేతముగా నుండునట్లు, ఈ ప్రవచనములో అతని గూర్చి ప్రప్రథమంగా తెలియజెప్పబడిన కుమారుడు, మొదట కొద్ది కాలములోనే పుట్టవలసి యున్నది. కొన్ని సంవత్సరములు గడచిన తరువాత, అష్షూరీయులు ఇశ్రాయేలు దేశము మీదికి (క్రీ.పూ. 733) మరియు సిరియా దేశము మీదికి (క్రీ.పూ. 732) దండెత్తి వచ్చి అచ్చటి నివాసులలో అనేకులను దేశ బహిష్కరణ గావించారు; పెకహూ మరియు రెజీను హతమార్చబడ్డారు (2 రాజులు 15:29, 30; 16:9). చివరకు ఇశ్రాయేలు దేశము అష్షూరీయులు చేత క్రీ.పూ. 722లో నాశనము చేయబడినది. ఇశ్రాయేలు మరియు సిరియా దేశముల మీదికి అష్షూరీయులు దండెత్తి రాక మునుపే, దేవుడు వాగ్దానము చేసినట్లే, పేర్కొనబడిన ఈ కుమారుడు జన్మించాడు.

ఆహాజుకివ్వబడిన సంకేతమేమనగా, పేర్కొనబడిన ఈ పుట్టుక కేవలము కాల వ్యవధిని సూచించుచుండినదై యుండినది. బిడ్డ జన్మించి, తనకై తానుగా తప్పొప్పులను విచక్షణా సహితంగా తెలిసికొను యుక్త వయస్సుకు చేరుకొనువరకు అవసరమై యుండిన కాలము, ప్రశ్నార్థకంగా మిగిలియున్న ఇద్దరు రాజులు రంగంలో నుంచి గతించిపోయిన తరువాత గడిచిపోవు కాలమై యుండును. ప్రవచనములోని కన్యక గర్భమున కుమారుడు జన్మించుట గూర్చిన భాగము రాజైన ఆహాజుకు జీర్ణమవలేదు; అతడు కేవలము కాలవ్యవధిని గూర్చిన సంకేతమునే గమనించుచుండెను. ఈ ఇద్దరు రాజులు గతించిపోవుటనుబట్టి, ఆహాజు తిగ్లత్పిలేసెరుతో కూటమి చేయకూడదని యెషయా ఆహాజును హెచ్చరించాడు.

ఈ ప్రవచనము యేసు కన్యక గర్భమందు జన్మించుట ద్వారా నెరవేరినదని మత్తయి చెప్పుచున్నాడు (1:23). మత్తయి యొక్క ధృవీకరణము ఈ ప్రవచనము కలిగియున్న ద్వంద్వ స్వభావమును చూపించుచున్నది. ఇది ఆనాడు అన్వయింపబడుటకు అవసరమై యుండినది, ఆహాజు నిమిత్తము – అష్షూరీయుల ద్వారా కలిగిన ఉపశమనము; మరియు మరొక రోజు అన్వయము కొరకు – కన్యక గర్భమందు క్రీస్తు పుట్టుట. కన్యక గర్భమందు జన్మించుట గూర్చి ప్రవచనములో పలుకబడిన భాగము యేసు జననము ద్వారా నెరవేరును. ప్రవచనములోని ఈ భాగమును ఆహజు అర్థంచేసికొనియుండడు. ఈ విషయాన్ని మన కొరకు మత్తయి యింత స్పష్టంగా సూచించి యుండనట్లయితే బహుశా, మనము కూడ అర్థంచేసికొని యుండలేకపోదుము.

యేసు మెస్సీయగా, దావీదు కుమారునిగా, అరుదెంచాడని చూపించుటకు యెషయా 7:14లోని ప్రవచనమును ఉల్లేఖించాడు. వంశపరంపరకు సంబంధించి దావీదు కివ్వబడిన వాగ్దానములను ఆయన నెరవేర్చుటకే, శాశ్వతంగా నెరవేర్చుటకే వచ్చాడు (2 సమూయేలు 7:12, 13). దీనికి అదనంగా, మరియ యింకను కన్యకయై యున్నప్పుడు,

యేసు అద్భుతకరమైన రీతిలో ఆ కన్యక గర్భమున ధరింపబడి జన్మించాడు. దేవుడు ఒకే ఒక్క యథార్థమైన కన్యక గర్భమందలి జననమును, మరియ ద్వారా యేసు జన్మించుటను ఉపయోగించుకొన్నాడు.[21]

**భాషాంతరమున దేవుడు మనకు తోడని అర్థమిచ్చు ఇమ్మానుయేలు** అను పేరు, చివరకు యేసు చేత శరీరధారణలో సార్థకముగా నెరవేర్చబడినది (యెషయా 9:6, 7 చూడుము). పాత నిబంధనలో, "దేవుడు మనకు తోడు" అను వ్యక్తీకరణము ఆయన ప్రజల జీవితములలో జరుగుచుండు దేవుని కార్యము మరియు వారనుభవించుచుండు ఆయన సన్నిధిని వర్ణించుటకు ఉపయోగింపబడినది, క్రొత్త నిబంధనలో, అది ఆయన ప్రజలు మధ్య నుండు దేవుని సజీవ సన్నిధినే సూచించుచున్నది. "వాక్యము" "దేవుని యొద్ద" మాత్రము ఉండలేదు కానీ "దేవుడై యుండెను" (యోహాను 1:1). "ఆ వాక్యము శరీరధారియై, కృపాసత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను" (యోహాను 1:14). మౌన్స్ గమనించిన విషయం ఇలా వున్నది, "సువార్త [మత్తయి] 'ఇమ్మానుయేలు' వాగ్దానముతో ప్రారంభమై – 'నేను యుగసమాప్తివరకు సదాకాలము మీతో కూడ ఉన్నాను' అను వాగ్దానముతో ముగియుట తగినదై యున్నది (మత్తయి 28:20)."[22]

## వేచియుండిన కాలము – విశ్వాసముతో కూడిన సమయము (1:24, 25)

**24యోసేపు నిద్రమేలుకొని ప్రభువు దూత తనకు ఆజ్ఞాపించిన ప్రకారముచేసి, తన భార్యను చేర్చుకొని 25ఆమె కుమారుని కను వరకు ఆమెను ఎరుగకుండెను; అతడు ఆ కుమారునికి యేసు అను పేరు పెట్టెను.**

**వచనము 24**. యోసేపు నిద్ర మేల్కొన్నప్పుడు, అతనికి తెలియజెప్పబడిన విషయములో గల సత్యసంధత్వమును గూర్చి ఒప్పింపబడ్డాడు, గనుక వెంటనే దేవదూత ఆజ్ఞాపించిన ప్రకారము చేసి, **మరియను తన భార్యగా** చేర్చుకొన్నాడు. యోసేపు "దేవుని చిత్తమునకు లోబడునట్లు, ఒక యూదీయ తండ్రికి అదొక అతి గొప్ప ప్రత్యేకార్హతయై యున్నదని తరుచుగా గోచరించు దానిని – తన తొలిచూలు కుమారుని కనుట/తన తొలిచూలు కుమారునికి తండ్రియై యుండుట – కూడ త్యాగం చేయుటకు ఇష్టపూర్వకంగా సిద్ధంగా ఉండెను."[23]

మరియ గర్భముదాల్చిన విషయాన్ని ఎరిగినవారు ఎలీసబెతు మాత్రమే గాక (మరియు, ఆమె భర్త జెకర్యా కూడ అని మనము అనుకొనవచ్చును) ఇతరులెందరున్నారో మనము తెలిసికొనుటకు ఏ మార్గము లేదు. కన్యకయైన ఆమె గర్భము ధరించి యొక కుమారుని కనునని దేవదూత గబ్రియేలు మరియకు ప్రకటించిన సమయంలోనే, ఆమె "బంధువురాలు" ఎలీసబెతు గర్భము ధరించియున్నదనియు, అప్పటికే ఆమెకు అది ఆరవ మాసమనియు, యోహాను అను కుమారుడు కలుగుననియు తెలియజెప్పాడు (లూకా 1:36). మరియకు ఈ ప్రకటన చేయబడిన వెంటనే ఆమె పరిశుద్ధాత్మ వలన గర్భము దాల్చినదనియు, గనుక "ఆ దినములయందు" (లూకా 1:39) ఎలీసబెతును సందర్శించుటకు ఆమె వెళ్లినదనియు వాక్య భాగం ధ్వనించుచున్నది. మరియ గర్భముదాల్చినదని ఆమె బంధువురాలు ఎరిగియుండెను (లూకా 1:42, 43). మరియ ఎలీసబెతుతో కూడ "యించు మించు మూడు నెలలు" ఉండినది (లూకా 1:56), అనగా ఆమె తిరిగి తన ఇంటికి వచ్చిన నాటికి, ఆమె

గర్భము దాల్చిన పరిస్థితి (శరీరములోని మార్పులనుబట్టి) బయటికి స్పష్టమగుచుండినది. దేవదూత అతనిని స్వప్నమందు సందర్శించిన వెంటనే యోసేపు మరియను తన భార్యగా చేర్చుకొన్నాడని భావింప బడుచున్నది గనుక, ఇంకా కొందరు ఇతరులు ఆమె పరిస్థితిని ఎరిగియుండవచ్చును.[24]

**వచనము 25. ఆమె కుమారుని కను వరకు [యోసేపు] ఆమెను ఎరుగకుండెను.** నిజముగా కన్యక గర్భము దాల్చి యొక కుమారునికి జన్మనిచ్చినదను వాస్తవమును ఈ ప్రకటన నొక్కిచెప్పుచున్నది. "[యోసేపు] ఆమెను కన్యగానే ఉంచాడు" అని చెప్పుటకు బదులుగా, గ్రీకు వాక్యభాగం అక్షరాలా "అతడామెను ఎరుగకుండెను" అని చెప్పుచున్నది (NKJV చూడుము). "ఎరుగుట" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*ginōskō*), దానికి సమానార్థమిచ్చు హెబ్రీ పదము (*yada'*) తో కూడా, ఈ రెండును లైంగిక సంబంధములను తెలియజేయటకు సభ్యతతో కూడిన పదములుగా ఉపయోగింపబడినవి (ఆదికాండము 4:1, 17, 25; లూకా 1:34; KJV చూడుము). కొన్ని గ్రీకు చేతి రాత ప్రతులలో "కుమారుడు" అని పదము యొక్క అర్థాన్ని విశదీకరించుచున్న "తొలిచూలు" అను విశేషణము రాయబడి యున్నది (KJV చూడుము), బహుశా దీనిని లూకా 2:7: "తన తొలిచూలు కుమారుని కని …" నుండి పరాదానముగా తెచ్చుకొని యుండవచ్చును.

పాపరహిత గర్భధారణ (Immaculate Conception - ఆమెను తన తల్లి తన గర్భమున దాల్చిన క్షణము నుండియే మరియ పాపరహితురాలై యుండెనను కెథోలిక్ సంఘ సిద్ధాంతము) గూర్చిన సిద్ధాంతము, దాని పైపై భావములో, తప్పుదోవను పట్టించునదై యున్నది. ఈ పదము ఎట్టి సందర్భములోనైనను యేసుక్రీస్తును సూచించుట లేదు; అది మరియను సూచించుచున్నది.[25] ఆమె దైవికమైనదై యుండినది, కాబట్టి ఆరాధింపబడుటకు ఆమె అర్హురాలను అభిప్రాయము దానిలో కలదు. కానీ పరిశుద్ధ సత్యవేదము ఈ సిద్ధాంతము ఉపదేశించుట లేదు; వాస్తవమునకు, అది మరియ యొక్క మానవీయత గూర్చిన అభిప్రాయమును మన మనస్సులో ముద్రవేయుచున్నది (12:46–50; 13:55; లూకా 2:48–51; యోహాను 2:3, 4; 19:25–27). పాపరహిత గర్భధారణ మరొక సిద్ధాంతముతో సంబంధము కలిగియున్నది, ఆ సిద్ధాంతము మరియ యొక్క అనవరతమైన కన్యత్వమును స్వాధికారంతో నొక్కిచెప్పుచున్నది. ఏదిఏమైనా, క్రీస్తు జననము "వరకు" (1:25), మరియ యోసేపులు లైంగిక సంబంధములకు దూరముగా ఉండిరనియు, లేదా అటుతరువాత, అనగా ఆ సమయంలో సామాన్య లైంగిక సంబంధములు మొదలయ్యాయనియు వాక్యభాగం ధ్వనించుచున్నదని మాత్రమే మత్తయి రాయుచున్న ఘోషణ యొక్క అర్థమై యున్నది. మరియకు ఇతర సంతానము కలిగినదను విషయం స్పష్టముగా తెలియుచున్నది, గనుక ఈ పిల్లలను, ఆమె సర్వసాధారణమైన రీతిలోనే, యోసేపు వలన గర్భముదాల్చినదని కూడ విదితమగుచున్నది (12:46; 13:55, 56).

యేసు జన్మించునంత వరకు మరియతో లైంగిక సంబంధములకు దూరముగా నుండుట వలన, మరియ కనిన కుమారుడు దేవుని కుమారుడై యుండెనని బయలు పర్చబడిన సత్యము ద్వారా యోసేపు తన సొంత విశ్వాసము అదెంత గొప్పదో ప్రదర్శించాడు. గనుక మరియ ఒక నీతిబాహ్యమైన స్త్రీయై యుండినది గనుక యేసు అక్రమ సంబంధము వలన కలిగిన సంతానమని చెప్పుచూ దేవదూషణచేయువారి నోరును ఈ వాస్తము ఎప్పటికినీ

మూసివేయుచున్నది.

యోసేపు మరియను తన భార్యగా చేర్చుకొనుట మాత్రమే కాదు, కానీ దేవదూత ఆజ్ఞను శిరసావహించుచు **ఆయనకు యేసు అను పేరు కూడ పెట్టాడు** (1:21). ఈ కార్యము చేయుట ద్వారా, యేసు "యోసేపు కుమారుడై యున్నాడను" న్యాయబద్ధమైన హోదాను అతడు యేసునకు కల్పించాడు (1:16; 13:55; యోహాను 6:42). యేసునకు ఎనిమిదవ దినమున పేరుపెట్టబడెను, అదే సమయంలో ఆయనకు సున్నతి చేయబడినది (లూకా 2:21). "యేసు" అను పేరు, ఆరంభ వచనాల్లోను ఈ విభాగము అంతమగుచున్న వచనాల్లోను కనిపించుచు దీని రచనకు ఒక ప్రధాన ఆధారమగుచున్నది (1:18, 25).

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### అవాంచిత శిశువు (1:18–25)

అనేక సంవత్సరముల క్రితం, అపురూపమైన ఒక చిన్న గ్రామంలో, ఒక శిశువు జన్మించాడు. ఈయన వైవాహిక సంబంధములేకుండా గర్భము ధరించిన ఒక తల్లికి జన్మించాడు. ఆమె సంస్కృతి ప్రకారము, ఇది అమెను మరణ శిక్షకు పాత్రురాలిగా చేయును. ఆమెను వివాహమాడనైయుండిన అబ్బాయి, ఆమె సంకటావస్థను ఎదుర్కొనుచుండినప్పటికిని, ఆమెను సరిగా అర్థంచేసుకొని ఆమెను ప్రేమించినవాడు, తన ప్రణాళికల ప్రకారమే ముందుకు సాగి ఆమెను వివాహమాడాడు. ఈ ప్రణాళికకు భిన్నమైన గర్భము వలన కలుగుచున్న అవమానమును మరియు కలవరమును ఆమె భరించవలసిన అవసరము లేదని, కొందరు ఈ యౌవ్వన స్త్రీకి సలహా ఇచ్చియుందురు. ఆమె ఈ విషయాన్ని రహస్యముగా, శిశువు యొక్క తండ్రికైనను ఎరుక కాకుండా దాచుకొని, గర్భస్రావము గావించుకొనవలెనని వారు ఆమెను ప్రోత్సాహించి యుందురు. అప్పుడు ఎవరికిని ఎప్పటికిని ఏమియు తెలియదు. ఈ కథలోని యౌవ్వన స్త్రీ, నీవు యింకా ఊహించుకొనలేకపోయినట్లయితే, యేసు తల్లియైన మరియయే.

గర్భస్రావము చాలా కాలము నుండి ఉన్న విషయమే. గనుక ఆ రోజుల్లో ఆది మరియకు కూడ అందుబాటులో ఉండియుండును. ఆమె గర్భస్రావము గావించుకొని యుండినట్లయితే ఏమై యుండేది? యేసు ఎన్నడను పుట్టనట్లయితే, ఏమి జరిగేది? మరియ గర్భములో ఆయన దేవుని కుమారుడు మరియు లోక రక్షకుని కంటె ఏమైన తక్కువైనవాడై యుండెనా? సహజంగానే, యేసు ఎవరై యుండెనో మరియ ఎరిగియుండెను (మత్తయి 1:20–23; లూకా 1:26–38 చూడుము), గనుక ఆమె ఎన్నటికైనను గర్భస్రావము గావించుకొనదు, కానీ 'ఒక వేళ' అని అనుకొందాము. లోకము యొక్క పరిస్థితి ఎంత విషమంగా ఉన్నదంటే, ఆయన లేకుండా అది మరింత నిరాశపూర్వకమును నిస్సహాయమైనదిగాను ఉండేది. ప్రతిరోజు అమాయకమైన మానవ జీవితములు వేల సంఖ్యలో నశింపజేయబడుచున్నవి. లోకమునకు దీవెనకరమై యుండినట్లు ఈ చిన్నపిల్లలో ఎంత మంది ఎదిగియుందురో కానీ అట్టి అవకాశము వారికెన్నడు దొరకలేదు కదా?

అవాంఛిత పసిబిడ్డలు అసాధారణమైన ఒక క్రొత్త అంశమేమీ కాదు. యేసు పుట్టినప్పుడు, తన తలితండ్రులు మరియు బహుశా యింకా కొందరు ఇతరులకు తప్ప, ఆయన ఒక

అవాంఛితమైన పసిబిడ్డయై యుండెను.

*రాజైన మహా హేరోదుకు యేసు అవాంఛనీయమైనవాడై యుండెను.* ఆయన సింహాసనమును ఎవరో ఒకరు అన్యాయంగా ఆక్రమించుకొంటారని ఈ హేరోదు భయపడుచుండెను. అదుపులో లేని బుద్ధిగలవాడైన ఈ పరిపాలకుడు, చపలచిత్తుడై అకస్మాత్తుగా ఆగ్రహావేశము నొందుచు హత్యాకాండలకు పాల్పడుటలో ప్రసిద్ధిగాంచినవాడు, "యూదులకు రాజుగా" పుట్టిన ఈ పసిబిడ్డ పుట్టుక గూర్చి విన్నప్పుడు ఆయనను చంపజూసాడు (మత్తయి 2:7–18).

*యేసు పెరిగి పెద్దవాడైనప్పుడు, ఆయన తన పరిచర్యను ప్రారంభించిన రోజుల్లో ఆయన సొంతవారిలోనే అనేకులు ఆయనను స్వీకరించలేదు* (యోహాను 7:5; అపొస్తలుల కార్యములు 1:14; 1 కొరింథీయులకు 15:7).

*యూదుల మతసంబంధమైన వ్యవస్థ ఆయనను అంగీకరించలేదు.* "ఆయన తన స్వకీయుల యొద్దకు వచ్చెను; ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదు" అని యోహాను రాయుచున్నాడు (యోహాను 1:11; యెషయా 53:3–9 చూడుము).

మానవ జీవితమును మనము దేవుడిచ్చిన ఒక బహుమానముగా ఆస్వాదించవలెను. మనము మన పిల్లలతో – తల్లిగర్భములో నున్నవారితోను, ఈ లోకములోనికి జన్మించినవారితోను – వ్యవహరించు విధానము ద్వారా ఈ సత్యము ప్రదర్శింపబడవలెను. గర్భస్రావమునకు – అమాయకులను నాశనము చేయుట మరియు సంరక్షించుకోలేని జన్మించని శిశువు సంహారమునకు – విరోధముగా మనమొక శక్తివంతమైన వైఖరి కలిగియుండవలెను. ఇంతమాత్రమేగాక, నిర్లక్ష్యము చేయబడు లేదా దూషింపబడు పిల్లల యెడల మనము కనికరము కనుపర్చవలెను.

## కన్యక గర్భవతియై కుమారుని కనుట (1:18–25)

యేసు, కన్యక గర్భమందు అద్భుతకరముగా గర్భము దాల్చబడుట మరియు జన్మించుట క్రైస్తవ విశ్వాసమునకు ముఖ్యమైన స్థంభములై యున్నవి. ఈ సంఘటనలకు సంబంధించిన ఐదు ముఖ్యమైన గమనికలను మనము చూద్దాము. (ఇవన్నీ కూడ "కన్యక గర్భవతియై కుమారుని కనుట" అని ప్రస్తావింపబడును.)

*కన్యక గర్భవతియై కుమారుని కనుట దైవికమైన కార్యమై యున్నది.* యేసు ఈ లోకము లోనికి వచ్చుట దేవుని కృప మరియు చొరవ యొక్క ఫలితమై యున్నది (యోహాను 3:16; ఎఫెసీయులకు 2:8–10). మానవుడు తనను తాను రక్షించుటకు ఏమియు చేయజాలడు. యేసును ప్రవేశపెట్టుట దంపతులొకరు కలిగియుండిన సంతాన సాఫల్య కోరికకు ఫలితము కాదు లేదా పిల్లలను పుట్టించవలెనను స్వాభావికమైన మానవ ప్రక్రియ యొక్క పర్యవసానము కాదు. విశేషంగా, అది దేవుని వలన కలిగిన ఒక అద్భుతకార్యముగా పరిశుద్ధాత్మ చేత పూర్తిచేయబడిన పనియై యున్నది (1:18, 20; లూకా 1:35), మానవులమైన మన అవసరమునకు అదొక దైవికమైన ప్రతిస్పందనయై యున్నది.

*కన్యక గర్భవతియై కుమారుని కనుట ప్రవచనముల నెరవేర్పై యుండెను.* యేసు ఈ లోకములోనికి వచ్చుట, యెషయా పలికిన ప్రవచనము: "ఇదిగో, కన్యక గర్భవతియై కుమారుని కనును, ఆయనకు ఇమ్మానుయేలను పేరు పెట్టుదురు" (1:23) యొక్క తుది

నెరవేర్పై యుండెను. క్రీస్తు వచ్చుట వలన, దావీదు సింహాసనముపై ఆసీనుడగు ఒక వంశస్థుని స్థాపించునట్లు దేవుడు తన వాగ్దానములను నెరవేర్చాడు (2 సమూయేలు 7:12, 13; అపొస్తలుల కార్యములు 2:29–36).

*కన్యక గర్భవతియై కుమారుని కనుట యేసు యొక్క అనాదిగా ఉండిన స్థితిని వివరించుచున్నది.* యేసు క్రీస్తు అనాదిగా ఉన్న స్థితిని క్రొత్త నిబంధన ఉపదేశించుచున్నది. "ఆది యందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను" అని యోహాను 1:1 సెలవిచ్చుచున్నది. యేసు క్రీస్తు ఈ లోకము లోనికి ఆశ్చర్యకరముగా అరుదెంచాడను వాస్తవము ఆయన ఎల్లప్పుడును ఉండినవాడను వాస్తవముతో అనుగుణంగా అల్లుకొనిపొవుచున్నది.

*కన్యక గర్భవతియై కుమారుని కనుట యేసు ఎలా సంపూర్ణ దేవుడును మానవుడునై యున్నాడో విశదీకరించుచున్నది.* "ఆ వాక్యము శరీరధారియై కృపా సత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెనని" యోహాను 1:14 సెలవిచ్చుచున్నది. మరియ (ఒక మానవ స్త్రీ) అద్భుతకరముగా ఒక కుమారుని గర్భమున దాల్చినది పరిశుద్ధాత్మ (దేవుడు) వలన కలిగినది, గనుక యేసు దైవికమైనవాడును అదే సమయంలో మానవుడునై యుండటకు ఇది హేతువై యున్నది (ఫిలిప్పీయులకు 2:6, 7 చూడుము). యేసు "దావీదు కుమారుడు" మాత్రమే కాదు, కానీ ఆయన "దేవుని కుమారుడును" అయియున్నాడు. ఆయన "ఇమ్మానుయేలు" అనగా, "దేవుడు మనకు తోడని అర్థమిచ్చుచున్నవాడై" యున్నాడు.

*కన్యక గర్భవతియై కుమారుని కనుట యేసు పునరుత్థానము మరియు పరలోకమునకు ఆరోహణమగుటతో పూర్తి చేయబడుతుంది.* యేసు ఈ లోకము లోనికి ఏ రీతిగా అద్భుతకరమైన విధానములో వచ్చాడో, అదే రీతిలో ఈ లోకమును విడిచిపెట్టాడు. మరణము తరువాత, ఆయన మూడవ దినమున మృతులలో నుండి లేపబడెను – ఒక శక్తివంతమైన కార్యముగా ఇది ఆయన దైవత్వమునకు సాక్ష్యమిచ్చుచున్నది (రోమీయులకు 1:4). వారు తమ కళ్లారా చూచినవారికి తన్నుతాను సజీవునిగా నలుబది దినముల వరకు కనుపర్చుకొనిన తరువాత, యేసు పరలోకమునకు ఆరోహణుడై వెళ్లెను. తండ్రి యొద్దకు తిరిగి చేరుకొన్నాడు (లూకా 24:51; అపొస్తలుల కార్యములు 1:9–11).

కన్యక గర్భవతియై కుమారుని కనుటను కాదనుట లేఖనముల ప్రేరేపణను మరియు ఆది సంఘ సాక్ష్యమును కాదనుటయే ఔతుంది. మరియ వ్యభిచారణియనియు, యేసు అక్రమ సంబంధము వలన కలిగిన సంతానమనియు ఇది చూపించును. ఇంతే గాక, ఇది యేసును అబద్ధికుడుగాను, మరొకరి వంటి మారువేశము ధరించిన వంచకునిగాను చేయును. గనుక కన్యక గర్భవతియై కుమారుని కనుటను తృణీకరించుట యేసు యొక్క దైవత్వమును మరియు రక్షకునిగా ఆయనకు గల శక్తిని తృణీకరింటయే ఔతుంది.

డేవిడ్ స్టూవర్ట్

## యోసేపు (1:18–25)

బైబిలులో గ్రంథస్థం చేయబడిన వివరాలు మనకు యోసేపు గూర్చి ఎక్కువగా తెలియజెప్పవు. ఆయన దావీదు వంశస్థుడై యుండెననియు (1:16, 20), నజరేతు పట్టణంలో నివసించాడనియు (లూకా 2:4) మనమెరుగుదము. ఆయన మరియకు

ప్రధానము చేయబడినాడు (లూకా 1:27) మరియు మరియ గర్భముదాల్చినది పరిశుద్ధాత్మ వలన కలిగినదని దేవదూత చేత తెలియజెప్పబడినాడు (1:18–21). యోసేపు దేవుని వాక్యమునకు విధేయతతో లోబడిన నీతిమంతుడును, జాలిగుండె గలవాడనై యుండెను (1:19, 24, 25; 2:14, 21, 22). క్రీస్తు పుట్టిన తరువాత, ఆయన నజరేతులో నివసించుచు జీవనోపాధి నిమిత్తము వడ్రంగి పని చేసాడు (మత్తయి 13:55). యేసు పండ్రెండేళ్ల వాడైనప్పుడు ఆయన తన కుటుంబ సమేతముగా యెరూషలేమునకు వెళ్లాడు, మరియు యేసు యొక్క జ్ఞానమంత గొప్పదైయుండినదో కళ్లార చూశాడు. ఆ తరువాత కుటుంబముతో తిరిగి నజరేతుకు వచ్చాడు, మరియు యేసుకు ఇహలోక తండ్రిగా ఉండుట కొనసాగించాడు (లూకా 2:41–52). ఆయనకు మరియ ద్వారా మరి ఆరుగురు సంతానము కలిగారని తప్ప, దీని తరువాత ఆయనకు ఏమి జరిగినదో మనకు తెలియదు (మత్తయి 13:55, 56). యేసు సిలువవేయబడిన నాటికి ఆయన మరణించియుండునని స్పష్టమగుచున్నది (యోహాను 19:25–27).

### రెండు ఖాళీ స్థలములు (1:18–25)

యేసు కథకు మరొక కోణమున్నది. అనేకులు పసిపాపాయి కావాలని ప్రాకులాడుదురు, కానీ దైవమానవుని కాదు. వారు శిశువైన యేసు జన్మమును మహోత్సవముగా జరిపించుకొనుచు మురిపెముతో మురిసిపోవుదురు, కానీ ఆయనను ప్రభువుగాను రాజుగాను అంగీకరించరు (అపొస్తలుల కార్యములు 2:14–47).

సంవత్సరం పొడుగానా రెండు ఖాళీ స్థలములు ప్రాముఖ్యమైనవై యుండును: ఖాళీ సత్రము మరియు ఖాళీ సమాధి. యేసు పశువుల తొట్టిలోనే పరుండి యుండలేదు. ఆయన పెరిగి పెద్దవాడయ్యాడు మరియు పరిపూర్ణమైన, పాపరహితమైన జీవితము జీవించాడు. ఆయన ఉపదేశించుచు స్వస్థతలను చేకూర్చు పరిచర్యను నిర్వహించాడు. చివరకు, మన పాపక్షమాపణ నిమిత్తమై ఆయన ఒక బల్యర్పణగా సిలువపై మరణించాడు. యేసు సమాధిలో సహితము పడియుండలేదు. ఆయన మృత్యుంజయుడై పునరుత్థానుడయ్యాడు, అందుచేతనే ఆయన పుట్టుక, జీవితము, మరియు ఆయన మరణమునకు అర్థమున్నది. యేసు క్రీస్తు ఈ లోకములోని ప్రతి ఒక్కరికిని అవాంఛనీయమైనవాడై యున్నప్పటికిని, అమితమైన పాపశాప బాధలలో నున్నవారికి ఆయన అత్యావశ్యకమైనవాడై యున్నాడు (మార్కు 16:15, 16; యోహాను 3:16–21; 7:7; 15:18, 19).

---

సూచనలు

[1]లూకా 1:26–56; 2:1–52; 8:19–21; యోహాను 2:1–11; 19:25–27 చూడుము. [2]Mishnah *Ketuboth* 1.2; 4.2. మిశ్నా, దాదాపు క్రీ.శ. 200 సంవత్సరముల సమయములో సంపూర్తి చేయబడిన ధర్మశాస్త్రమునకు సంబంధించినదైన యూదీయ వాగ్రూప సాంప్రదాయముల ఒక సంకలనమై యున్నది. [3]1:20లో, NASB "మరియను నీ భార్య వలె చేర్చుకొనుము" అని పదమును చేర్చినది. అయితే దీనిని అక్షరార్థముగా, "నీ భార్యయైన మరియను చేర్చుకొనుము" అని అనునదింపవచ్చును (NKJV చూడుము). [4]Mishnah *Kiddushin* 4.9. [5]Mishnah *Gittin* 6.7; 9:4. [6]Ibid., 9.3. [7]Donald A. Hagner, *Matthew 1-13*, Word Biblical Commentary, vol. 33A (Dallas: Word Books, 1993), 18. విశ్వాసఘాతుకమైన భార్యభర్తల సందర్భములలో యూదా మత బోధకుల సాంప్రదాయము విడాకులు కోరినట్లు కనిపించుచున్నది. (Mishnah *Yebamoth* 2.8; *Sotah* 5.1.) [8]Robert H. Gundry, *Matthew: A Commen-*

*tary on His Literary and Theological Art* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 21. [9]D. A. Carson, *The Gospel According to John*, Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1991), 335. [10]Ibid., 591.

[11]Douglas R. A. Hare, *Matthew*, Interpretation (Louisville: John Knox Press, 1993), 9. [12]Ibid. [13]Hagner, 18. [14]Robert H. Mounce, *Matthew*, New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 10. [15]Ben Witherington III, "Birth of Jesus," in *Dictionary of Jesus and the Gospels*, ed. Joel B. Green and Scot McKnight (Downers Grove, Ill.: InterVarsity Press, 1992), 62. [16]Hagner, 17. [17]David Hill, *The Gospel of Matthew,* The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1972), 78. [18]Ibid. యెషయా 11:2; 42:1; యోవేలు 2:28 చూడుము. [19]Sirach 46:1 (NRSV; నొక్కి చెప్పింది చేర్చబడినది.). [20]Leon Morris, *The Gospel According to Matthew*, Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 29.

[21]యెషయా 7:14 గూర్చిన అదనపు అధ్యయనము కొరకు H. C. Leupold, *Exposition of Isaiah* (Grand Rapids, Mich.: Baker Book House, 1968), 1:155-59. [22]Mounce, 10-11. [23]Witherington, 62. [24]ఏదిఏమైనా, గాలివార్తలు వ్యాపించియుండును. యూదుల చేత చేయబడిన ఒక ప్రకటన ("మేము వ్యభిచారము వలన పుట్టినవారము కాము"; యోహాను 8:41) యేసు తల్లి పరిణయమునకు మునుపే గర్భము దాల్చినదను వాస్తమునకు వెన్నుపోటని కొందరు పండితోత్తములు అర్థంచేసికొన్నారు. అటుతరువాత, యేసు మరియ యొక్క అక్రమ సంబంధ సంతానమై యుండెనని స్వాధికారంతో చెప్పుకొనుచుండిన అల్పవిశ్వాసులైన యూదులు క్రైస్తవ్యముపై దాడి చేశారు. (Origen *Against Celsus* 1.28.) [25]మరియకు సంబంధించిన సిద్ధాంతముల గూర్చిన అదనపు సమాచారము కొరకు Geoffrey W. Bromiley, "Mary," in *The International Standard Bible Encyclopedia,* rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1986), 3:268-73 చూడుము.

### ✧✧✧✧✧ లోతైన దృష్టి ✧✧✧✧✧

### యేసు ఏ తేదిన పుట్టాడు? (1:18–25)

యేసు పుట్టిన తేదిని హేరోదు మహారాజు పరిపాలనా కాలపు (క్రీ.పూ. 37–4)సంబంధము ననుసరించి ఉజ్జాయింపుగా చెప్పుకొనవచ్చును. చారిత్రాత్మకముగా, హేరోదు క్రీ.పూ. 4వ సంవత్సరము ఏప్రిల్ మాసంలో మరణించాడని మనమెరిగిన విషయమే. యేసును హతమార్చుటకు హేరోదు సకల ప్రయత్నములు చేశాడను వాస్తవమును ఆధారం చేసుకొనుచు, అప్పటికి యేసు వయస్సు దాదాపుగా రెండు సంవత్సరములుండునని లెక్కవేసుకొన్నట్లయితే (మత్తయి 2:16) యేసు, దాదాపు క్రీ.పూ. 5వ సంవత్సరములో జన్మించియుండునని గ్రహింపనగును. ఆ రోజుల్లో తేదీలు లెక్క కట్టబడుచుండిన విధానమునుబట్టి ఈ విషయంలో గందరగోళము ఏర్పడుచున్నది. క్రీస్తు పుట్టుక తేదిని నిర్ధారించగలుగునట్లు ఆరవ శతాబ్దములో మొదలుపెట్టిన డయోనిసియస్ ఎక్సిగూస్[1] అను ఒక కథోలిక్కు సాధువు తప్పుడు లెక్కలు వేయుటవలన కూడ ఈ తికమక ఏర్పడినది. ఒక సరైన తేదిని లెక్కవేయుటకు అవసరమై యుండిన సకల దస్తావేజులు ఆయనకు అందుబాటులో లేకుండినవి.

డిసంబరు 25వ తేది క్రీస్తు జయంతి దినంగా వేడుక చేసికొనుట, లైబీరియస్[2] అను ఒక రోమన్ కథోలిక్కు బిషప్ చేత జారీ చేయబడిన శాసనమునుబట్టి, క్రీ.శ. 360లో ప్రారంభమయ్యింది. అంతకు మునుపు, క్రీస్తు జయంతి స్మారకోత్సవములు మార్చి 20 లేక ఏప్రిల్ 18న నిర్వహింపబడినవి. డిసంబరు 25వ తేది యొక్క ఎంపిక సంఘములోని అనేక సంఘ విద్రోహ ముఠాల మధ్య ఏర్పడిన ఒక ఒప్పందమై యుండినది. సాధించిన విజయమును

పురస్కరించుకొని “నూతన రవితిష్ట” లేక శీతాకాల దక్షిణాయనాంతం[3] జరుపుకొనుచుండిన సాటర్నేలియ మరియు బ్రుమేలియ ఉత్సవముల విందు భోజనములనుబట్టి ఎంపికచేయబడి యుండును. క్రీ.శ. 379లో కాన్‌స్టాంటినోపుల్ లోను, క్రీ.శ. 380లో అంతియొకయలోను క్రీస్తు జన్మము ఒక గొప్ప ఉత్సవముగా జరుపుకొనబడినది. అలెగ్జాంద్రియాకు చెందిన క్రైస్తవ వేదాంతవేత్త ఒరిగెన్ (సుమారుగా 185–254) ఈ క్రింది విధంగా చెప్పుచూ, క్రీస్తు జయంతిని ఒక పండుగగా పాటించవలెనను అభిప్రాయమును నిరాకరించాడు:

> ఈ విధమైన జయంతి దినము గూర్చి పాపులు మాత్రమే ఆనందిస్తారు. ఎంచేతనంటే పాత నిబంధనలోని ఫరో, ఐగుప్తుకు రాజైనవాడు [ఆదికాండము 40:20], క్రొత్త నిబంధనలోని హేరోదు రాజు [మార్కు 6:21], వారి వారి జన్మదినములందు విందారగించుచు వేడుక చేసికొనుటలో మనము ఈ విషయాన్ని నిజముగా చూడగలము.[4]

యేసు పుట్టిన తేదీని మనము కచ్చితముగా తెలిసికొనలేకపోయినప్పటికిని, ఆయన డిసంబరు మాసంలో కాకుండా, సెప్టెంబరులో పుట్టియుండవచ్చును. అది ఎలా చెప్పగలము? బాప్తిస్మమిచ్చు యోహాను గూర్చి మనకు తెలసిన దానినిబట్టి చెప్పవచ్చును. యోహాను, యాజకుడైన జెకర్యా మరియు ఆయన సతీమణి ఎలీసబెతు యొక్క కుమారుడై యుండెను. ఎలీసబెతు, యేసు తల్లియైన మరియకు బంధువురాలు. యోహాను యేసు కంటె ఆరు మాసములు ముందుగా జన్మించాడు (లూకా 1:36). యోహాను జన్మము గూర్చి దూత జెకర్యాకు తెలియజెప్పిన సమయంలో, జెకర్యా ఆలయములో తన యాజక ధర్మమును నిర్వర్తించుచుండెను. జెకర్యా, అబీయా క్రమము నుండి (లూకా 1:5), రాజైన దావీదు ఏర్పాటు చేసిన వరుసక్రమములో ఎనిమిదవ వంతు నుండి వచ్చినవాడు (1 దినవృత్తాంతములు 24:5–10 చూడుము).

యేసు జన్మము గూర్చిన మరొక ఉల్లేఖన సూచన లూక రాసిన సువార్తలో నున్నది “ఆ దినములలో సర్వలోకమునకు ప్రజా సంఖ్య రాయవలెనని కైసరు ఔగుస్తువలన ఆజ్ఞ ఆయెను. ఇది కురేనియు సిరియ దేశమునకు అధిపతియై యున్నప్పుడు జరిగిన మొదటి ప్రజాసంఖ్య” (లూకా 2:1, 2). చారిత్రక రికార్డుల ప్రకారము, క్రీ.పూ. 28లో ప్రజా సంఖ్య రాయబడవలెనని ఔగుస్తు ఆజ్ఞాపించాడు, ఇతరులు క్రీ.పూ. 8లోను, క్రీ.శ. 14లోను ఆజ్ఞాపించారు. స్పష్టముగా, ప్రజాసంఖ్యలు రోమా పౌరులకు మాత్రమే వర్తించుచుండినవి. హేరోదు పరిపాలనా కాలంలో, రాజ్యము సాంకేతికంగా ఒక రోమా సామ్రాజ్యము కాదు, అది రోమా ప్రభుత్వముతో ఒక మిత్ర రాజ్యము వంటి సంబంధము మాత్రమే కలిగియుండినది గనుక, ఆయన తన స్వతంత్రతను చాటి చెప్పుకొనుటకు హేరోదు జనాభా లెక్కలు రాయబడుటను రెండు సంవత్సరముల వరకు ఆలస్యం చేసియుండవచ్చును. ఇది ఆయన విషయంలో ఒక విశిష్టమైన విషయమై యుండవచ్చును. కురేనియు సిరియా దేశమునకు అధిపతియై యుండినప్పుడు రాయబడినదని తెలియుచున్న ఒకే ప్రజా సంఖ్య క్రీ.శ. 6లో రాయబడినది లేదా, దాదాపుగా హేరోదు మహారాజు మరణించిన దశాబ్దము తరువాత జరిగిన మొదటి ప్రజాసంఖ్యయై యున్నది. ఏదిఏమైనా, ఆయన మరొక చోట చూపించుచున్న చారిత్రాత్మక కచ్చితత్వము ఆధారంగా లూకా ప్రస్తావించుచున్న ఈ ప్రజా సంఖ్య ప్రతి రక్షింపబడవచ్చును. ఇంకా, కురేనియు క్రీ.శ. 6 మరియు 7లో సిరియా

దేశమునకు అధిపతిగా నుండెనని తెలిసినప్పటికిని, ఈ తేదీలు అంతకంటే మునుపటి క్రీ.పూ. 10 నాటి కాలమై యుండవచ్చునని రోమ్‌లోని ఉన్నత క్రైస్తవాచార్య పీఠము యొక్క పురావస్తు ప్రదర్శన శాలలో నున్న శిథిలమైన శిలాశాసనము సూచింపవచ్చును. వాస్తవమునకు, క్లుప్త అంతరాయములతో, కురేనియు క్రీ.పూ. 12 మొదలుకొని క్రీ.శ. 16 వరకు ఏదో ఒక హోదాలో సిరియా దేశమునకు అధిపతియై యుండవచ్చును.[5] అలాగైతే, ప్రశ్నార్థంగా మిగిలిపోయిన ప్రజాసంఖ్య, క్రీ.పూ. 8లో ఔగుస్తు చేత ఆజ్ఞాపింపబడినదై యుండవచ్చును. ఇంతేగాక, లూకా రచించిన వాక్యభాగము సరైన రీతిలో భాషాంతరీకరణము చేయబడినప్పుడు సమస్య పరిష్కారింపబడుతుందని, నైజెల్ టర్నర్, స్కాట్లాండు దేశం, ఎడింబర్గ్ విశ్వవిద్యాలయంలోని ఒక పండితుడు, గ్రంథస్థం చేశాడు. ఈయన దీనిని ఈ విధంగా అనువదించాడు: "ఈ ప్రజా సంఖ్య కురేనియు సిరియా దేశమునకు అధిపతిగా నున్నప్పుడు జనాభా లెక్కలు రాయబడక మునుపు జరిపింపబడినది."[6] ఏదిఏమైనా, ఈయన దృక్పథము, విస్తృతంగా వివాదమునకు గురియగుచున్నది.

---

సూచనలు

[1]Hans Achelis, "Dionysius Exiguus," in Samuel Macauley Jackson, ed., *The New Schaff-Herzog Encyclopedia of Religious Knowledge* (Grand Rapids, Mich.: Baker Book House, 1963), 3:441. [2]Philip Schaff, *History of the Christian Church*, vol. 3, *Nicene and Post-Nicene Christianity* (New York: Charles Scribner's Sons, 1916), 395. [3]Albert Henry Newman, "Christmas," in Samuel Macauley Jackson, ed., *The New Schaff-Herzog Encyclopedia of Religious Knowledge* (Grand Rapids, Mich.: Baker Book House, 1963), 3:48. [4]Origen *Homilies* on Leviticus 8.3. [5]Frederick W. Danker, *Jesus and the New Age: A Commentary on St. Luke's Gospel*, rev. and exp. (Philadelphia: Fortress Press, 1988), 23 నందు కురేనియు జీవితమును గూర్చి చర్చించబడినది. [6]Jeffery L. Sheler, "The First Noel," *U.S. News and World Report* (21 December 1992): 84.